వరలక్ష్మీ వ్రతానికి వేళాయె

అలంకరణ అంటే ఎంత ఇష్టమో చెప్పనక్కర్లేదు. అందులోనూ సృజనాత్మకతను జోడిస్తూ.. మనసారా వేడుకుంటూ చేసే వరలక్ష్మి వ్రతాల్లో అలంకరణే ప్రత్యేక ఆకర్షణ. సిరుల తల్లి కట్టుబొట్టు నుంచి నైవేద్యం వరకూ ప్రతిదీ కొత్తగా ఉండాలనుకుంటారు. అమ్మవారితోపాటు దీపాలు, కలశాలు, ముత్తయిదువులకు ఇచ్చే తాంబూలాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని కొనేందుకు మహిళలు చొరవ చూపడంతో మార్కెట్ కళకళలాడుతోంది.

- మహిళలతో కళకళలాడుతున్న దుకాణాలు
- ఈ నెల 16న వరలక్ష్మీ వ్రతం



విక్రయానికి సిద్ధంగా బంగారు వస్తువులు



మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధంగా బంగారు లక్ష్మీకాసు

కడప కల్చరల్ : సౌభాగ్యం, సంపదలు, కుటుంబ శ్రేయస్సు కోసం మహిళలు ఈ మాసంలో ఆచరించే వాటిలో శ్రీవరలక్ష్మీ వ్రతం ప్రధానమైనది. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని చేసుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ నెల 16న శుక్రవారం ఈ వ్రతం నిర్వహించనున్నారు. ఇళ్లలో పవిత్ర కలశాన్ని ప్రతిష్టించి అమ్మవారి మూర్తిని దానిపై ఉంచి పూజలు చేస్తారు. ఇప్పటి నుంచే వ్రతానికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు మహిళలు చొరవ చూపుతున్నారు. దీంతో గత వారం రోజులుగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణాల దుకాణాలు, చిల్లర సరుకులు వంటి అనేక వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో నిండిపోయి కనిపిస్తున్నాయి. అనేక పెద్ద, చిన్న వస్త్ర వ్యాపారులు శ్రావణమాసం సందర్భంగా భారీ ఆఫర్లు ప్రకటించటంతో మహిళలు కొనుగోలు చేయటానికి రావటంతో కళకళలాడుతున్నాయి.

బంగారం.. కొనుగోలుకు ఆసక్తి

కలశం వద్ద కొత్తగా కొన్న బంగారు వస్తువులను ఉంచడం ఆనాటి సంప్రదాయంగా వస్తోంది. పండగ నాటికి బంగారం ఖరీదు పెరుగుతుందనే భావనతో మహిళలు ముందే కొద్దో గొప్పో బంగారం కొనుగోలు చేస్తారు. ఈ పండగ కోసమని బంగారు వ్యాపారులు ప్రత్యేకంగా తక్కువ ధర గల చిన్న వస్తువులను అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవి రూపం గల బంగారు కాసులు, చిన్న డాలర్లు, అమ్మవారి రూపాలను ఒకటి నుంచి రెండు, మూడు గ్రాముల బరువుగల వస్తువులను విక్రయాలకు సిద్ధం చేశారు. వాటితోపాటు వెండితో చేసిన అమ్మవారి ముఖ రూపాలను అందుబాటులో ఉంచారు. కాసులు, బరువును బట్టి రూ. 2000 నుంచి రూ. 7,000 వరకు విక్రయిస్తున్నారు. బంగారు కాసులు, ముక్కు పుడకలు, చిన్న డాలర్లు, చిన్న కమ్మలకు గిరాకీ ఉందని జ్యువెలరీ దుకాణాల యజమానులు తెలిపారు. ప్రత్యేకించి వరలక్ష్మి వ్రతం కోసం మహిళలు చిన్న వస్తువులైనా కొంటారని తెలిపారు. దీనికి తోడు గత రెండు, మూడు సంవత్సరాలతో పోలిస్తే ఈ శ్రావణ మాసంలో వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారం జోరందుకున్నదని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రాకేష్‌చంద్రన్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 22 అర్జీలు రాగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 10, టౌన్‌ప్లానింగ్–7, రెవెన్యూ విభాగం –4, హెల్త్ విభాగం–1 అర్జీలు వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రత్నాల రాజు, డీసీపీ సూరజ్ కుమార్, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ నాగరాజుపేట, ఓల్డ్ బస్టాండ్, పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంతాలను పరిశీలించారు. అన్న క్యాంటీన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా చేయాల్సిన అన్ని ఏర్పాట్లను చేయాలని, శుభ్రం చేసిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలన్నారు. తాగునీరు. అల్పాహారం విషయాల్లో లోటుపాట్లు రాకూడదన్నారు.

మాదక ద్రవ్యాల రహిత దేశంగా భారత్



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ అధ్యాపకులు, విద్యార్థులు

ఏఎఫ్‌యూ : మాదక ద్రవ్యాల వినియోగం లేని దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతామని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

సోమవారం డా.వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో నాషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలు ముట్టుకోమంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు దేశానికి మేలు చేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఓబయ్య, హరికృష్ణలు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునః ప్రారంభించాలని అంబేడ్కర్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఓబయ్య, కో కన్వీనర్ హరికృష్ణ కోరారు. సోమవారం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 472, జిల్లాలో 21 జూనియర్ ఎయిడెడ్ కళాశాలలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ముఖ్యంగా దూర ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆ తర్వాత ఈ పథకాన్ని ఎత్తివేశారని తెలిపారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఆర్‌యూబీ మంజూరు

- తాము మంజూరు చేయించినదానికి టీడీపీ నాయకులు టెంకాయ కొట్టడం హాస్యాస్పదం
- సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే విశ్వనాథపురం రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరైందని సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎర్రముక్కపల్లె నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైతే స్థానికులంతా తాము తమ స్థలాలు, ఆస్తులను కోల్పోయి రోడ్డున పడతామని, తమ ఆస్తులకు నష్టం కలగకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలు ప్రజల కోరిక మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు చేయించారన్నారు. ఈ మేరకు ఎర్రముక్కపల్లె నుంచి విశ్వనాథపురం నుంచి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, స్థలాలు, ఇళ్లు కోల్పోయే వారికి నష్ట పరిహారం కూడా చెల్లించడం జరిగిందన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షపునీరు వస్తే తాము నిర్వహణ చేస్తామని మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలోని పాలకవర్గం రైల్వే వారికి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. 2023 డిసెంబర్‌లో ఈ పనులను ప్రధాని నరేంద్రమోడీ కడప రైల్వేస్టేషన్ పనులతోపాటు ఆర్‌యుబి పనులను కూడా వర్చువల్‌గా ప్రారంభించారని, మేయర్, తమ కార్పొరేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారన్నారు. ఈ పనులకు టెండర్లు ఆలస్యమయ్యాయని, అందుకే తమ ప్రజా ప్రతినిధులు ప్రారంభించలేదన్నారు. ఇప్పుడు టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డిలు ఆ పనులకు టెంకాయ కొట్టి తామే మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రెండు నెలల్లోనే అన్ని జీవోలు తెచ్చి అనుమతులు సాధించడానికి వీరి చేతిలో మంత్రదండం ఏమైనా ఉందా అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే 15 రోజుల్లో బుగ్గవంకపై బ్రిడ్జి నిర్మాణం ప్రారంభిస్తామని హామీలు ఇచ్చారు.. ఎందుకు నిర్మించలేకపోతున్నారని ప్రశ్నించారు. కడప నగరంలో అభివృద్ధి చెందని ప్రాంతాలు ఎన్నో ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసి మేమే చేశామని చెప్పుకుంటే బాగుంటుందన్నారు. ఎన్నికల ముందు ఎన్నో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఇప్పటికైనా నిజాలు చెప్పాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ, 20వ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

వారి సేవలు స్ఫూర్తిదాయకం



విక్రమ్ సారాబాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు



కోటిరెడ్డి మహిళా డిగ్రీకళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ : డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్‌సారాబాయ్, లైబ్రరీ సైన్స్ ప్రముఖుడు ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ విక్రమ్ సారాభాయ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. లైబ్రరీ బాధ్యులు డా. భూతపురి సురేంద్రశర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఎస్.ఆర్. రంగనాథన్ లైబ్రరీసైన్స్‌లో మార్గదర్శకుడుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఫణీంద్రరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లైబ్రరీ సైన్స్ ప్రముఖుడు రంగనాథన్ జయంతి సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పూలమాల వేశారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు మదన్‌మోహన్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు దేశమంతటా హర్ ఘర్ తిరంగా యాత్ర వెయ్యి అడుగుల జాతీయజెండాతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశి భూషణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, గోకుల్ సర్కిల్ మీదుగా వన్‌టౌన్ గాంధీ విగ్రహం వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి



ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : మండలంలోని రైతులందరూ తాము సాగు చేసిన పంటలకు తప్పని సరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దేవరాజుపల్లెలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను కలిసి ఆధార్, భూమి పాసు పుస్తకం జిరాక్స్‌లను అందించి తాము సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు: వల్లూరు మండల పరిధిలోని తప్పెట్ల సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీ సుబ్బులయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సుబ్బులయ్య అనే వ్యక్తి వల్లూరు నుంచి కమలాపురానికి ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా తప్పెట్ల సమీపంలో ఆటో, బైక్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న సుబ్బులయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స కోసం అతన్ని 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

సర్దుబాటు ప్రక్రియపై ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వైవీయూ : అశాస్త్రీయమైన పని సర్దుబాటు ప్రక్రియలో సవరణలు చేయాలని కొన్ని సంఘాలు కోరగా, 117 జీఓను రద్దు చేయాలంటూ పలు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాలెం మహేష్ డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను కలిసి పని సర్దుబాటులోని లోపాలను సవరించాలని కోరారు. ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేసేలా ఉన్న ఉత్తర్వులను సవరించాలని కోరారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియను బాయ్‌కాట్ చేశారు. అనంతరం డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్‌లకు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా, స్టేట్ మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు. వేంపల్లిలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓలకు వినతి పత్రాలు అందజేశారు. వర్క్‌అడ్జెస్ట్‌మెంట్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం సమయంలో పలు పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి మాట్లాడుతూ అశాస్త్రీయమైన జీఓనెం.117ను రద్దు చేయకుండా ప్రభుత్వం ముందుకెళ్లడం సరికాదని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారులు

వైవీయూ : విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారులు రాజగోపాల్‌రెడ్డి, కృష్ణప్ప పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన జిల్లాస్థాయి క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్, మాచనపల్లి, దువ్వూరు (ప్రథమ), ఏపీ మోడల్‌స్కూల్, ఖాజీపేట (ద్వితీయ), జెడ్పీహెచ్‌ఎస్, చిన్నమాచుపల్లె, చెన్నూరు (తృతీయ) స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో కడప ఎంఈఓ–1 గంగిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఎబినైజర్, క్విజ్ మాస్టర్లు సురేష్, దామోదర్, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

కమలాపురం: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చిరుద్యోగులపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఆయన కమలాపురం తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోజువారి వేతనంతో పని చేస్తున్న స్కీం వర్కర్లతో అధికార పార్టీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీనామా చేయని వారిపై సరిగా పని చేయడం లేదనే అసంబద్ధ ఆరోపణలు చేస్తూ తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి అధికారుల ద్వారా స్కీం వర్కర్లను తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన స్కీం వర్కర్లను బలవంతంగా తొలగించాలనుకోవడం ప్రభుత్వ తిరోగమనానికి నాంది అన్నారు. కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ, వివిధ సంఘాల నాయకురాళ్లు మరియమ్మ, రాణి, అమ్ములు, భారతి, యశోద, శోభారాణి, వసంత, వెంకట లక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేద్య పరికరాల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి

వైవీయూ : జిల్లాలో బిందు/తుంపరి సేద్య పరికరాల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా సూక్ష్మనీటి సాగుపథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన జిల్లాలోని పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 31,500 హెక్టార్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలో ఇప్పటికే సేద్యపరికరాల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతిరైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు వీఏఏఎస్/వీహెచ్‌ఏఎస్/వీఎస్‌ఏఎస్/ఎంఐఏడీలు తమ పరిధిలోని అధికారుల వద్ద దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకుని ప్రాథమిక తనిఖీ అయిన తర్వాత రైతు వాటా చెల్లిస్తే పరికరాలు పొందవచ్చన్నారు. జిల్లా కంపెనీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ ఎస్. మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజినీర్లు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

చింతకొమ్మదిన్నె: కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద సోమవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా లారీ నిలబడిపోయింది. దీంతో ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీకేదిన్నె ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి తమ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వల్లూరు : ప్రజలకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరిగిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి పన్నులు 100 శాతం వసూలు చేసి ప్రతి ఒక్కరూ తమ పంచాయతీలను అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ప్రసాద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదిర్శులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఈఓపిఆర్డి శివరామిరెడ్డి, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



కమలాపురం: విజేతకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపల్ వినోద్ కుమార్



వేంపల్లె: డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను సన్మానిస్తున్న సిబ్బంది

కమలాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా.వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయాల విశిష్టత, ఆవశ్యకత గురించి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో లైబ్రేరియన్ విజయభారతి, స్టాఫ్ రవి కుమార్, అశోక్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ కుమారస్వామిగుప్తా పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ కుమారస్వామిగుప్తా మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతీదేవి నిలయాలన్నారు.విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. అనంతరం క్యాంపస్‌లోని గ్రంథాలయ అధికారి కోనప్ప ఆధ్వర్యంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను సన్మానించి మెమెంటో అందజేశారు.

క్లుప్తంగా

కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో తమ బంధువు చికిత్స పొందుతోందని తిరుపతికి చెందిన లేవాకు వెంకటేష్ ఆటోను తీసుకుని వచ్చాడు. ఈ ఆటోను రిమ్స్ ఆవరణంలో పార్కింగ్ చేసి వుంచగా గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను దొంగిలించుకుని తీసుకుని వెళ్లారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం రిమ్స్ పిఎస్ ఎస్ఐ యు.వై జయరాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

'పీస్' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం మరియా పురంలోగల పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తిరుపతిలో జరిగిన సౌత్ జోన్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో 8 గోల్డ్, 3 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. 8వ తరగతికి చెందిన మహమ్మద్ సుమయా (2 గోల్డ్ మెడల్స్), 6వ తరగతికి చెందిన షేక్. ఇబ్రహీం (రెండు గోల్డ్ మెడల్స్), 7వ తరగతికి చెందిన షేక్ రిమాస్ (రెండు గోల్డ్ మెడల్స్), 4వ తరగతి కి చెందిన షేక్ ఖాలీద్ (2గోల్డ్ మెడల్స్), 6వ తరగతికి చెందిన ఇసాక్ (1సిల్వర్, 1 బ్రాంజ్), 6వ తరగతి కి చెందిన సయ్యద్ ఇబ్రహీం ఖలీలుల్లా (2సిల్వర్ మెడల్స్) సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ హర్షం వ్యక్తం చేసి చిన్నారులను అభినందించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ షఫీ

కడప కార్పొరేషన్ : మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో 37వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజద్‌బాష ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయన ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గౌతమ బుద్ధ టౌన్‌షిప్‌లో తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలని ఆ టౌన్‌షిప్ నివాసులు జి. అనిల్ కుమార్‌రెడ్డి, జి. నరసింహారెడ్డి, హేమకుమార్ యాదవ్ కోరారు. సోమవారం వారు అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు. తమ టౌన్‌షిప్ డీటీసీపీ అప్రూవల్ పొందిన లే ఔట్ అని, డెవలపర్స్ రోడ్లు, కాలువలు, పార్కులు, బోర్లు నిర్మించి కార్పొరేషన్‌కు స్వాధీనం చేశారన్నారు. అందువల్ల టౌన్‌షిప్‌లో బోర్లు, విద్యుత్ దీపాలు ఆన్ అండ్ ఆఫ్ చేయుటకు లైన్‌మెన్, చెట్ల కొమ్మలు తొలగించుటకు గార్డెనర్, పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలని కోరారు.

18న అక్కినేని శతజయంతి వేడుకలు

కడప కల్చరల్ : సీనియర్ తెలుగు సినీనటులు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలను ఈనెల 18న స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం .రామకృష్ణ, బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన సినిమాల్లోని పాటలను గాయకులు వినిపిస్తారన్నారు. సాయంత్రం 5.00 గంటలకు ఆయనపై రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శన, 6.00 గంటలకు విద్యార్థులతో ఆయన పాటలకు అభినయం ఉంటాయన్నారు. అక్కినేని బొమ్మలతో మ్యాజిక్ షో ఏర్పాటు చేశామని వివరించారు. స్థానిక గాయకులు ఉదయం 10 గంటలకు వేదిక వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

మహిళా పాలిటెక్నిక్‌లో నూతన కోర్సు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఈనెల 19 నుంచి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పేరుతో నూతన కోర్సును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.హెచ్. జ్యోతి తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థినులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఏపీ టెక్నికల్ స్టేట్ బోర్డు నుంచి సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఫీజు రూ.1500/-గా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వీరారెడ్డిని 94925 88629 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.